- మంత్రి, ఎమ్మెల్యేల మధ్య మరోసారి చిచ్చుపెట్టిన వివాదం
- కంకర క్రషర్స్‌కు కాలుష్య నియంత్రణ విభాగం నోటీసులు
- నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నాయని కొన్ని సీజ్
- ఈ నెల 12 నుంచి మూతపడిన యంత్రాలు
- తమకు తెలియకుండా నోటీసులా.. అంటూ స్థానిక ఎమ్మెల్యేల అగ్రహం
- ఓ మంత్రి అనుచరుల ఒత్తిళ్లతోనే నోటీసులు ఇచ్చారని మండిపాటు
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, అనుచరులవేనని ఓ మంత్రి అనుచరులవాదన
- గులాబీ నేతల క్రషర్లకు ఎలా సపోర్ట్ చేస్తున్నారని ఎమ్మెల్యేలకు ప్రశ్న
- సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరిన ఓరుగల్లు క్రషర్స్ పంచాయితీ

7

కాంగ్రెస్‌లో.. క్రషర్ ఫైట్!





ఓరుగల్లు కాంగ్రెస్‌లో క్రషర్ ఫైట్ జరుగుతోంది. ఓ మంత్రి, ఐదారుగురు ఎమ్మెల్యేల మధ్య వివాదానికి కారణమైంది. నిబంధనలకు విరుద్ధంగా కంకర క్రషర్లున్నాయని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు ఇస్తే.. కావాలనే తమ నియోజకవర్గాల్లో ఓ మంత్రి జోక్యం చేసుకుంటున్నారని ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. అయితే క్రషర్లలో అధిక భాగం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులవేనని, అలాంటప్పుడు మీకెందుకు మంట అంటూ మంత్రి అనుచరులు ఎదురుదాడికి దిగుతున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సయోధ్య అంతంతమాత్రంగానే ఉండగా, తాజాగా క్రషర్ల లొల్లితో ఆ విభేదాలు మరింత పెరిగినట్టు జరిగినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లుగా తెలుస్తుండగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య పొడచూపిన విభేదాలు అధిష్ఠానానికి తలనొప్పిగా మారాయన్న చర్చ జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి-వరంగల్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అద్వైత్‌కుమార్ సింగ్

ఇష్టంతో కష్టపడి చదువుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- ఈఎంఆర్ఎస్ ఆకస్మిక సందర్శన
- విద్యార్థులతో కలిసి భోజనం

బయ్యారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇష్టంతో కష్టపడి చదివి, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకాంక్షించారు. శనివారం రాత్రి నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్)ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టడీ అవర్‌లోని పిల్లలతో ముచ్చటించి, సబ్జెక్టుల వారిగా వివరాలు అడిగితెలుసుకున్నారు. వసతి గృహంలోని పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ క్రమంలోనే పిల్లలతో కలిసి ఆయన భోజనం చేశారు. వసతి గృహంలోని సేవలపై పిల్లలను అడిగితెలుసుకున్నారు. కాగా, రాత్రి వేళల్లో పిల్లలకు ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

ఎన్నాళ్లు.. ఎదురు చూపులు!

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం నిరీక్షణ

- ఏడాది కావస్తున్నా విశ్రాంత ఉద్యోగులకు అందని దైన్యం
- జిల్లాలో పదవీ విరమణ పొందినవారు 157 మంది
- ఒకొక్కరికీ సగటున రూ.30 లక్షల వరకు పెండింగ్
- ప్రభుత్వం వెంటనే చెల్లించి, ఆదుకోవాలని విజ్ఞప్తి



మానుకోటలో సమావేశమైన పదవీ విరమణ ఉద్యోగులు, వారికి సంఘీభావంగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు (ఫైల్)

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వశాఖల్లో వివిధ హోదాల్లో వారు సేవలదించారు.. పదవీవిరణ కూడా పొందారు.. రిటైర్‌మెంట్ ఉద్యోగులు వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల (రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్) కోసం ఎదురు చూస్తున్నారు. పదవీ విరమణ పొంది ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం నుంచి అందాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో ఆర్థిక కష్టాలు పడుతున్నారు. ఉద్యోగ సమయంలో తాము దాచుకున్న సొమ్ము ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ అవసరాలు, పిల్లల భవిష్యత్, ఆడపిల్లల వివాహాల కోసం ఉపయోగపడుతాయన్న వారి ఆశలు ఆవిరైపోతున్నాయి. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో పదవీవిరమణ ఉద్యోగులు ఆలోచనల్లో పడ్డారు. రిటైర్డ్ అయి సంవత్సరం గడిచింది.. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో మార్చి మాసంలోనైనా తమకు బెనిఫిట్స్ అందుతాయని పదవీవిరమణ ఉద్యోగులకు ఆశలు చిగురిస్తున్న తరుణంలో ఉద్యోగులు, పదవీవిరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై రాష్ట్ర సర్కార్ పెట్టిన సీలింగ్ వారిపై పిడుగులా పడింది. పెండింగ్ బిల్లులు ప్రతీనెల రూ.300 కోట్లు మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో వారి ఆశలకు మళ్లీ గండి పడింది. కాగా, మానుకోట జిల్లాలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో పాటు, విధుల్లో ఉండగా మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలు మొత్తంగా సుమారు 157 మంది బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నారు.

31 మార్చి 2024 నుంచి ఉద్యోగుల పదవీ విరమణలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 58 సంవత్సరాలుండేది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక, రెండోసారి అధికారంలోకి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం 2021 సంవత్సరంలో ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడేళ్లకు పెంచారు. దీంతో 58 నుంచి 61 సంవత్సరాలకు పొడిగించబడింది. ఈ క్రమంలో మార్చి 2021 నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో ఉద్యోగుల పదవీ విరమణ లేవు. 31 మార్చి 2024తో మూడేళ్ల గడువు పూర్తి కావడంతో నాటి నుంచి ఉద్యగులు రిటైర్‌మెంట్‌లు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నెలలో ఉద్యోగులు రిటైర్‌మెంట్ అవుతూ వస్తున్నారు. ఒక్క సంవత్సరంలో రాష్ట్రంలో దాదాపు 8 వేల వరకు ఉద్యోగులకు పదవీ విరమణ పొందారు. ఇందులో అత్యధికంగా ఉపాధ్యాయులే ఉండడం విశేషం.

ఒకొక్క ఉద్యోగికి సగటున రూ.30 లక్షల వరకు..

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఒకొక్కరికి సగటున రూ.30 లక్షల వరకు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ అందాల్సి ఉంది. ఉద్యోగులకు గ్రాట్యుటీతో పాటు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), కమ్యూటేషన్, సరేండర్‌లీవ్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ (జీఎల్ఐ), మెడికల్ బిల్లులు తదితర బెనిఫిట్స్‌ను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగుల స్థాయిని బట్టి ఒక్కొక్కరికి సుమారు రూ.30 నుంచి రూ.60 లక్షల వరకు బెనిఫిట్స్ రూపంలో ఉద్యోగులకు చేతికందుతాయి. వీటి కోసం పదవీ విరమణ పొందె సమయంలో ఉద్యోగులు ముందస్తుగా దరఖాస్తులు చేసుకుంటారు. ఉద్యోగ విరమణ పొంది ఏడాది కావస్తున్నా ఇంత వరకు పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాలు అందక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పదవీవిరణ పొందిన వారికి పిడుగులా సీలింగ్

పదవీ విరమణ పొంది రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం విధించిన సీలింగ్ వారిపై పిడుగులా పడింది. ప్రతీనెల పెండింగ్ బిల్లుల చెల్లింపులు నెలకు రూ.300 కోట్ల మాత్రమే ఉండాలని ప్రభుత్వం ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలివ్వడంతో ఇక తమకురిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ అందడానికి ఇంకేంతకాలం పడుతుందోనన్న ఆందోళన మొదలైంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది పదవీ విరమణ పొంది ఉండడం.. ప్రతీనెల మరికొంత మంది ఉద్యోగులు రిటైర్డ్‌మెంట్ అవుతుండడంతో సీలింగ్‌ను అమలు చేస్తూ.. చెల్లింపులు జరిపితే ఎంత సమయం పడుతుందోనన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కార్యాలయాల చుట్టూ తిరిగి వేశారిపోయిన వారు కొందరు కోర్టులను ఆశ్రయిస్తుంటే మరి కొంతమంది ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటికే పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమావేశాలు ఏర్పాటు చేస్తూ తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుడుతామని ప్రకటించారు. కాగా, జిల్లాలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, విధుల్లో ఉండగా మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలు మొత్తంగా సుమారు 157 మంది బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. అంటే ఒక్క జిల్లాలోనే సుమారు రూ.50 నుంచి 60 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

పదవీవిరమణ బెనిఫిట్స్ అందించి ఆదుకోవాలి



మార్చి 2024 సంవత్సరం నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ అందించి ఆదుకోవాలి. పదవీ విరమణ పొంది ఏడాది కావస్తున్న నేటి వరకు ఎలాంటి బెనిఫిట్స్ అందక పోవడం బాధాకరం. బెనిఫిట్స్ రాక పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆందోళనకు గురై అనారోగ్యాల పాలవుతున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతాయని ఆశపడ్డ ఉద్యోగులకు నిరాశ ఎదురవుతుంది. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించి పదవీ విరమణ ఉద్యోగ కుటంబాల్లో భరోసా నింపాలి.

- గుగులోతు కిషన్‌నాయక్, రిటైర్డ్ హెచ్‌ఎం, మానుకోట

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా రాధ



సునీతారావుతో నూనావత్ రాధ

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ మహిళ విభాగం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలుగా గూడూరు మండలం రాములుతండాకు చెందిన నూనావత్ రాధ మరోమారు ఎన్నికయ్యారు. రాధ కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రను పోషిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. గతంలో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో, పార్టీలోని పలు పదవుల్లో కొనసాగారు. జాతీయ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ ఆమోదం మేరకు.. రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు జిల్లా అధ్యక్షురాలుగా రాధకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులకు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి జిల్లామహిళ అధ్యక్షురాలుగా ఎన్నికైన రాధను గూడూరు బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్, పెసరి శివ, కన్నబోయిన వెంకన్న, సమ్మక్క, హెచ్.శివ, మండల మల్లేష్, భూక్య పద్మ, వాంకుడోతు బాలు, చాంద్ పాష, గల్ల చంటి సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలను గెలిపించి, బడుగుల ఆత్మగౌరవాన్ని కాపాడి అగ్రకుల అహంకారాన్ని, ఆధిపత్యాన్ని సమాధి చేయాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అంతా సంఘటితమై వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర చట్టసభల్లో 5 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి 42 మంది ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27 వేల ఓట్లు బీసీ సామాజిక వర్గానికి ఉంటే రెడ్డి సామాజిక వర్గానికి కేవలం 2200 ఓట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. వచ్చేఅసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రానికి బీసీ సీఎం కావడం ఖాయమన్నారు. బీసీల గెలుపు బీసీల అభివృద్ధికి మలుపు అని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు శ్రీనివాస్, వేణు, విజయలక్ష్మి, భూపతి పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనంతారం సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా ఫార్మసీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశానికి అర్హత పరీక్ష ఆదివారం జరుగుతందని ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 5 నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు నేడు అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే పరీక్షకు ఉదయం 10 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

బీసీలకు సగం వాటా దక్కాల్సిందే

సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్



సాంబశివరావు రచించిన బీసీ మేనిఫెస్టో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు.. జనాభా ప్రాతిపదికన వారికి సగం వాటా దక్కాల్సిందేనని ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ స్పష్టం చేశారు. మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం ఉద్యమాల ఉపాధ్యాయుడు, బీసీ దళపతి సాంబశివరావు జయంతిని పురస్కరించుకుని ఆయన రాసిన 'బీసీలు సగం-బీసీలకు సగం వాటా' అనే శీర్షికతో రచించిన బీసీల సిద్ధాంత గ్రంథం బీసీ మేనిఫెస్టో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంబశివరావు రచించిన తెరమరుగైన బీసీల సిద్ధాంత గ్రంథం బీసీ మేనిఫెస్టోను సీనియర్ న్యాయవాది కొండబత్తుల యాదగిరి బృందం, మహాత్మాజ్యోతిరావు పూలే అకాడమీ ఆధ్వర్యంలో ముద్రణ చేయించడం అభినందనీయమన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు దక్కాల్సిన వాటా రాజ్యాంగ బద్ధంగా దక్కాలని చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో నిలబడ్డ బీసీలకు ఓటు వేయాలని కోరారు. అనంతరం బీసీ మేనిఫెస్టో పుస్తకాన్ని ముద్రణ వేయించిన న్యాయవాది కొండబత్తుల యాదగిరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శంతన్ రామారాజు, వేముల వెంకన్న, కన్న అశోక్‌బాబు, సోమారపు వీరస్వామి, గుంజె హన్మంతు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సాయికిరణ్, శాంతన్, చిన్నా, సీతారాం పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఈ ఘటనలో ఆరుగురు అరెస్టు
- రూ.1.50 లక్షల నగదు, 80 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



మాట్లాడుతున్న తిరుపతిరావు

మహబూబాబాద్‌రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈనెల 5న జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించినట్లు మానుకోట డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు వివరాలను వెల్లడించారు. మానుకోట పట్టణానికి చెందిన పరకాల సుశీల ఇంట్లో బానోత్ సుగుణ అనే మహిళ పని చేస్తోంది. ఆమె గత కొన్నిరోజులుగా పనికి రాకపోవడంతో ఆమెపై అనుమానం వచ్చిన సుశీల మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు బానోత్ సుగుణను విచారించారు. దీంతో ఆమె చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. ఆమెతోపాటు జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ నగర్‌కు చెందిన ఉప్పలి నవీన్, జుజురియా సంతోష్, చేపల మార్కెట్‌కు చెందిన ఠాకూర్ శంకర్, ఫారెస్టు సెంటర్‌కు చెందిన ఆడానియా సంతోష్, గుమ్ముడూరుకు చెందిన శాకుల శివమణి ముఠాగా ఏర్పడినట్లు చెప్పారు. ఈ నెల 5న పని మనిషి సుగుణ, నవీన్ సుశీల ఇంట్లోలేని సమయంలో దాచిన రూ.1.50 లక్షల నగదు, 80 గ్రాముల బంగారు ఆభరణాలు (విలువ సుమారు రూ.3.90లక్షలు), రెండు సెల్‌ఫోన్‌లు అపహరించుకుపోయినట్లు నిజం ఒప్పుకున్నారు. వాటిని వారినుంచి స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులను పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, క్రైం ఎస్సై జె.వెంకటేశ్వర్లును ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అభినందించారు.

ములుగు అదనపు కలెక్టర్‌కు సీతక్క పరామర్శ



రాధాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

రఘునాథపల్లి/ములుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన ములుగు జిల్లా అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీతో పాటు అతని కుటుంబసభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ అలియాస్ సీతక్క శనివారం పరామర్శించారు. మహేందర్‌జీ తల్లి రాధాబాయి(78) రఘునాథపల్లిలో ఈనెల 14న అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా మహేందర్‌జీ ఇంటికి చేరుకున్న మంత్రి సీతక్క రాధాబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చీమలపాటి మల్లాజీ, కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, శ్రీనివాస్, భానుజీ, రఘు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నీలం ఐలేష్ పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొని
వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన నాగయ్య

తొర్రూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం తొర్రూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. పట్టణ శివారు దుబ్బ తండా వద్ద చీకటాయపాలెంకు చెందిన బద్ది నాగయ్య(60) సైకిల్‌పై గ్రామానికి వెళ్తుండగా వరంగల్ జిల్లా రాయపర్తి పోలీస్‌స్టేషన్‌కు చెందిన పెట్రోలింగ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ అడగగా.. గాయాలయ్యాయని, మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వీరాపూర్ టూ నస్తూరుపల్లి..

- కాటారం రేంజ్ పరిధిలోనే పెద్ద పులి సంచారం
- అడవుల్లోని వాగు, బండ్ల బాటలో పాదముద్రల ఆనవాళ్లు
- గత 12 రోజులుగా టైగర్ మానిటరింగ్‌లో అటవీశాఖ అధికారులు నిమగ్నం



వీరాపూర్ అడవుల్లో పులి జాడ కోసం గాలిస్తున్న అధికారులు

కాటారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవుల్లో మళ్లీ పెద్దపులి సంచారం అధికారులు, ప్రజల్లో కలకలం రేపుతోంది. పెద్దపులి వీరాపూర్ అడవుల నుంచి నస్తూరుపల్లి అడవుల్లోకి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మహదేవపూర్ అడవుల్లో నుంచి పెద్దపులి కాటారం రేంజ్ పరిధిలోకి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించగా పులి జాడ కోసం శనివారం అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లో పలుచోట్ల పరిశీలించారు. వీరాపూర్ అడవుల్లోని కుంటలో పులి నీళ్లు తాగి బండ్ల బాట గుండా నస్తూరుపల్లి అడవుల్లోకి వెళ్లినట్లు పలుచోట్ల పాదముద్రల(పగ్ మార్క్స్)ను అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఈనెల 9వ తేదీ రాత్రి పులి నస్తూరుపల్లి అడవుల్లో కనిపించగా అప్పటి నుంచి అది కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలోని అడవుల గుండా సంచరిస్తున్నది. దీంతో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి నేతృత్వంలో అటవీ అధికారులు, జన్నారం, కవ్వాల్ అభయారణ్యం టైగర్ ట్రాకర్లు 12 రోజులుగా టైగర్ మానిటరింగ్‌లో ఉన్నారు. పలుచోట్ల ట్రాప్ కెమెరాలు బిగించారు. 8-10 బృందాలు పులి జాడ కోసం అడవుల్లో జల్లెడ పడుతున్నారు. దానికి ఎలాంటి హాని కలుగకుండా అది ఈ అడవులకు ఎందుకొచ్చింది.. ఇన్ని రోజులు ఏం చేస్తుందనే దానిపై నిశితంగా విశ్లేషిస్తున్నారు. పులి సంచారంపై అటవీశాఖ అధికారులు గోప్యత పాటిస్తూ పూర్తి సమాచారాన్ని బయటికి వెల్లడించడం లేదు. గత రెండు వారాలుగా పులి ఈ అడవుల్లోనే సంచరించడంతో స్థావరం కోసం వెదుక్కుంటుందా, మేటింగ్ కోసం వచ్చిందా..అనే అనుమానాలు, అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో అటవీ అధికారులు చంద్రశేఖర్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

దంతాలపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బేడబుడగ జంగాల కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బేడబుడగ జంగాల కాలనీలోని పస్త మహేష్ ఇంట్లో బైక్ సామాన్లు, మొబైల్ ఫోన్‌తో పాటు నిద్రిస్తున్న మహేష్ మేడలో నుంచి చైన్ అపహరించినట్లు బాధితుడు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే తమకు ఫోన్లో సమాచారం ఇవ్వాలని ఎస్సై పిల్లల రాజు పేర్కొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మట్ట సరిత

లోక్ అదాలత్‌లను
వినియోగించుకోవాలి

తొర్రూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సత్వర సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని తొర్రూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలను రాజీ దిశగా మాట్లాడాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని కక్షిదారులకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రాజీ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. అత్యధిక కేసులు పరిష్కరించేందుకు పోలీసులు స్టేషన్‌లో వివిధ బృందాలను ఏర్పాటు చేసి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐలు గణేష్, రాజ్‌కుమార్, కోర్టు పరిధిలోని ఎస్సైలు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

తొర్రూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ప్రాంత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులు ధర్నా నిర్వహించి ఆర్డీవో గణేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వరరావు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ మాట్లాడుతూ తొర్రూరుకు మంజూరైన వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పట్టణంలో ప్రధాన రహదారిపై డ్రైనేజీల నిర్మాణం పూర్తిచేసి కరంట్ పోల్స్‌ను తొలగించిన చోట రోడ్డు నుంచి డ్రైనేజీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, మినీ ట్యాంక్ బండ్ పనుల పునఃప్రారంభం చేయాలన్నారు. ప్రధానంగా తొర్రూరులో ఎస్టీవో, ఫైర్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్, ఇరిగేషన్ కార్యాలయం, మినీ ఇండోర్ స్టేడియం, బాలికల హై స్కూల్, పాలిటెక్నిక్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పనులను సంబంధిత అధికారులు చొరవ చూపి ప్రారంభించకుంటే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్డీ.యాకూబ్, బందు మహేందర్, ఓమ భిక్షపతి, కిరణ్, వీరన్న, శ్రీను, సోమిరెడ్డి, సాంబయ్య, సాయిమల్లు, యాకయ్య, వెంకట్ రెడ్డి, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు



ఆలయంలో కాలసర్ప దోష నివారణ పూజల్లో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో శనివారం కాలసర్ప దోష నివారణ పూజలు అధిక సంఖ్యలో జరిగాయి. భక్తులు ఉదయం నుంచి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి సన్నిధానంలో పూజలు నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గడ్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

కుంభమేళాలో మానుకోట ఎంపీ పుణ్యస్నానం



ప్రయాగరాజ్ కుంభమేళాలో పుణ్యస్నానమాచరించి పూజలు చేస్తున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్ కుంభమేళాలో శనివారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ పుణ్యస్నానమాచరించారు. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానమాచరించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరమ పవిత్రమైన కుంభమేళాలో స్నానమాచరించడం సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నట్లు బలరాంనాయక్ తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు టీడీపీయే పోటీ

- మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మానుకోట మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అన్నారు. మహబూబాబాద్‌లోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశంపార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. తెలంగాణ రాజకీయాల్లో చంద్రబాబు మరో రూపంలో వస్తున్నారని వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రాంతాల పేరిట వైశమ్యాలను రెచ్చగొట్టి రాజకీయల్లో స్వార్థబుద్ధితో కేసీఆర్ చంద్రబాబును విమర్శించడం అవివేకానికి నిదర్శమన్నారు. ఈ సమావేశంలో పేరం వీరస్వామి, ఏసబోయిన యాకన్న పాల్గొన్నారు.

అయ్యో పాపం!

- నాలుగు నెలలకే నూరేళ్లు నిండాయి
- నిద్రలోనే కవల పిల్లల కన్నుమూత
- పాలు పట్టించిన అనంతరం ఘటన
- గణపురం మండలంలో విషాదం





మృతి చెందిన కవల పిల్లలు, పిల్లలకు తాగించిన పాల పౌడర్ డబ్బాను చూపిస్తున్న తల్లి

గణపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలకే నూరేళ్లు నిండాయి. ముక్కుపచ్చలారని కవల చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. అప్పటి దాకా తల్లి ఒడిలో పాలు తాగి నిద్రించిన ఆ చిన్నారులు నిద్రలోనే మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. అయ్యోపాపం అంటూ స్థానికులు కంటతడి పెట్టారు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని నగరంపల్లిలో శనివారంజరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపల్లికి చెందిన తనుగుల బాలరాజు-రజిత దంపతుల కూతురు లాస్యశ్రీకి, అదే మండలంలోని గొల్లపల్లికి చెందిన మర్రి అశోక్‌తో మూడేళ్లక్రితం వివాహమైంది. వారికి మొదటి సంతానంగా రెండేళ్ల క్రితం కుమారుడు జన్మించగా, రెండో సంతానంగా నాలుగు నెలలక్రితం పాప,బాబు(కవలలు) జన్మించారు. ఈక్రమంలో లాస్య తన పుట్టినిల్లయిన నగరంపల్లిలో ఉంటోంది. రెండు నెలలుగా లాస్య ఓ కంపెనీకి చెందిన పాలపొడిని ఆ చిన్నారులకు పడుతోంది. శుక్రవారం సాయంత్రం కొత్త పౌడర్ ప్యాకెట్‌ను తెప్పించిన లాస్య శనివారం ఉదయం ఉదయం 8 గంటలకు ఒకసారి, 10 గంటలకు ఒకసారి చిన్నారులకు పాల పౌడర్ కలిపిన ద్రావణాన్ని తాగించి పడుకోబెట్టింది. ఆ తర్వాత మధ్యాహ్నం 1గంట సమయంలో నిద్రిస్తున్న పిల్లలను చూడగా ముక్కుల్లోంచి పాలు రావడం, స్పృహకోల్పోయి కనిపించడంతో వెంటనే స్థానికంగా ఉండే ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. కానీ, పిల్లల పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించడంతో వారు భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు ఆ చిన్నారులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. దాంతో తల్లి, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పుట్టిన తర్వాత తమ పిల్లలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, పాల పౌడర్ వికటించడం వల్లే తమ పిల్లలు మృతి చెందారని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కవలలను పోస్టుమార్టం నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు పిల్లలకు గతంలో ఏమైనా అనారోగ్య కారణాలున్నాయా లేక మరేఇతర కారణాలతో మరణించారా అని దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలోనే పాలపౌడర్ డబ్బాను స్వాధీనం చేసుకుని.. దాన్ని విక్రయించిన దుకాణంలో విచారణ జరిపారు. ఆ పాల పౌడర్ గతేడాది సెప్టెంబరులో తయారు కాగా.. ఈఏడాది డిసెంబరు వరకు కాలపరిమితి ఉందని తెలుస్తోంది. ఇక ఈ ఘటనకు కారణాల గురించి తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' సదరు చిన్నారులను పరీక్షించిన భూపాలపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుడిని సంప్రదించగా.. పిల్లలకు పాలు కానీ, ద్రావణాలను కానీ తాగించినప్పుడు ఎత్తుకుని వారికి త్రేన్పులు వచ్చే వరకు వీపు నిమరాల్సి ఉంటుందని, అలా కాకుండా పాలు తాగించగానే పడుకోబెడితే ఒక్కో సందర్భంలో ఆ ద్రావణాలు ఊపిరితిత్తుల్లోకిచేరి ముక్కుల ద్వారా బయటకొస్తాయని, ఆసమయంలో శ్వాసఆడక పిల్లలు చనిపోయే అవకాశాలుంటాయన్నారు. ఇక ఈ కవల చిన్నారులను తమ ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికే చనిపోయి ఉన్నారని, పోస్టుమార్టం రిపోర్టు వస్తే వారి మృతికి గల కారణాలపై స్పష్టత వస్తుందన్నారు.

ఖాతా తీస్తేనే పింఛన్ డబ్బులు?

తొర్రూరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో ఖాతాతీస్తే పింఛన్ డబ్బులు ఇస్తామంటూ బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పింఛన్‌దారులు ఆరోపిస్తున్నారు. శనివారం తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి పెన్షన్ ఇవ్వడానికి వచ్చిన బ్రాంచి పోస్టుమాస్టర్ పింఛన్‌దారులు రూ.500 చెల్లించి పోస్టాఫీసులో ఖాతా తీసుకోవాలని, లేనిపక్షంలో పింఛన్ ఇవ్వనని చెప్పడంతో స్థానిక యువకులు వచ్చి నిలదీశారు. దీంతో పింఛన్ ఇవ్వకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై తొర్రూరు పోస్టాఫీస్ అధికారి విద్యాసాగర్‌ను వివరణ కోరగా.. పోస్టాఫీసుల్లో ఉన్న పథకాలను వివరించడంతోపాటు ఖాతాలు తీసుకునే విధంగా ప్రజల్లో తీసుకెళ్తున్నామన్నారు. రూ.500 పెట్టి కచ్చితంగా ఖాతా తీయాలి అనే నిబంధన లేదన్నారు. ప్రజలభిష్టం మేరకు ఖాతాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఐలయ్య (ఫైల్)

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలం మాటేడు గ్రామ చెరువులో స్నానాలకు వెళ్లి గల్లంతైన దూదిమెట్ల ఐలయ్య (45) మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్సై ఉపేందర్ వివరాల ప్రకారం. శుక్రవారం మాటేడు గ్రామ పెద్దచెరువు వద్దకు స్నానాలకు వెళ్లి దూదిమెట్ల ఐలయ్య అనే వ్యక్తి గల్లంతై ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం రిస్క్యూ టీంతో గాలింపులు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య దూదిమెట్ల నీరజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్షుద్రపూజల పేరుతో
అర తులం బంగారం చోరీ



బంగారం దోపిడి చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

పెద్దవంగర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దొంగ బాబాల ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. ప్రజల నమ్మకాన్ని సొమ్ము చేసుకుంటూ ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. దేవుడిపై ఉన్న భక్తి, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని దొంగ బాబాలు అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం ఉప్పరగూడెం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన సముద్రాల శోభ ఇంటికి వచ్చిన బురిడి బాబాలు జ్యోతిష్యం, కుటుంబ సమస్యలను తీర్చుతానని చెప్పి నమ్మించారు. అది పోవడానికి పూజలు చెస్తానని చెప్పారు. పరిహారంగా ఆమె నుంచి నగదు కావాలని ఆశించాడు. ఈ క్రమంలో ఆమెకు నుదిట్టిన బొట్టు పెడుతున్న క్రమంలో మత్తు మందు చల్లడంతో స్పృహ కోల్పోవడంతో ఆమె చెవులకు ఉన్న అర తులం బంగారం చోరీ చేసి పరారయ్యాడు. శోభ కుమారుడైన కార్తీక్ బురిడి బాబాల ఫొటోలను సెల్‌ఫోన్‌లో చిత్రకరించాడు. దీనిపై ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా.. ఘటన స్థలాన్ని పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




లక్నవరం సరస్సు అందాలు

మన్యంలో మిస్ వరల్డ్ ఈవెంట్లు


అందాల పోటీలకు ఆతిథ్యమివ్వనున్న లక్నవరం, రామప్ప

- నిర్వహణకు పర్యాటక శాఖ సమాయత్తం
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఏర్పాట్లు
- శైవక్షేత్రంలో నిర్వహణ పట్ల భిన్నాభిప్రాయాలు

ములుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బ్యూటీ ఆఫ్ నేచర్, బ్యూటీ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లకు పర్యాయపదాలుగా చెప్పుకొనే ములుగు జిల్లాలోని లక్నవరం, రామప్ప ప్రపంచసుందరి పోటీలకు వేదిక కానున్నాయి. ఫ్యాషన్ ప్రపంచానికి మరో మెట్టుగా భావించే ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌కు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మే 4 నుంచి 31వ తేదీ వరకు 72వ మిస్‌వరల్డ్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రారంభ వేడుకలు, ఫైనల్ పోటీలు, ముగింపు వేడుకలకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ క్రమంలో మధ్యలో జరిగే పలు 'థీమ్స్' పేరుతో ఈవెంట్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ప్రాంతాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో ములుగు జిల్లాలోని ప్రపంచ ప్రఖ్యాత రామప్ప దేవాలయం, లక్నవరం ఉండగా.. వీటితో పాటు యాదాద్రి, అనంతగిరిలో పలు ఈవెంట్లు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. తొలిసారి ములుగు జిల్లాలో రెండుచోట్ల అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు జరుగుతుండడం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది.



కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా నిలిచిన మదనిక విగ్రహం



రామప్ప దేవాలయం

ప్రపంచం దృష్టిలో రామప్ప, లక్నవరం

800 ఏళ్ల క్రితం కాకతీయుల ఏలుబడిలో నిర్మాణమైన అద్భుతమైన రాతి కట్టడం రామప్ప. అలనాటి శిల్పకళా నైపుణ్యానికి, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం. మదనికలు, సాలబంజికలు అప్పటి ఆచార వ్యవహారాలకు ప్రతిబింబంగా నిలుస్తుండగా హైహీల్స్ ధరించినట్టుగా ఉండే ఓ మదనిక విగ్రహం కాకతీయులకాలం నాటి ఫ్యాషన్ పోకడలను ప్రస్ఫుటిస్తోంది. ఇక్కడి రాతి విగ్రహాలను మీటితే సప్తస్వరాలు పలుకుతాయి. కాకతీయులు యుద్ధ ప్రేరణకు స్ఫూర్తిగా ప్రోత్సహించిన పేరిణి నృత్యరీతి ఇక్కడి శిల్పాల్లో ఇప్పటికీ సజీవం. అందుకే నాలుగేళ్ల క్రితం ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందింది. దీంతో ఇటీవలి కాలంలో ప్రపంచ దేశాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఇదేక్రమంలో గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు ప్రకృతి సోయగాలతో ఆకట్టుకుంటుంది. ఉయ్యాల వంతెనలు, దీవులతో ప్రత్యేకతను సంతరించుకుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇటీవలే ఓ దీవి టూరిస్టులకు అందుబాటులోకి వచ్చింది. అండమాన్ నికోబార్, మాల్దీవులలో ఉండే సదుపాయాలు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు చోట్ల ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించిన కార్యక్రమాలు జరుగుతుండడంతో అంతర్జాతీయ సమాజం దృష్టి వీటిపై పడనుంది. కవరేజీలో భాగంగా ఇంటర్నేషనల్ మీడియా ఈ రెండు ప్రదేశాలను హైలెట్ చేస్తోంది. దీంతో అంతర్జాతీయ స్థాయిలో రామప్ప, లక్నవరం వెలుగొందనున్నాయి.

అందాల పోటీలపై భిన్న వాదనలు

అందాల పోటీలంటేనే అశ్లీలత, అసభ్యత ఉంటుందనే వాదన బలంగా వినిపిస్తోంది. అలాంటిది ప్రపంచ సుందరి పోటీల ంటే వేరే లెవల్. శిల్పకళా నైపుణ్యంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న రామప్పలో అందాల పోటీలు నిర్వహించడంపై భిన్న వాదనలు వినిపిస్తు న్నాయి. కురుచ దుస్తులు, ర్యాంప్ వాక్‌లకు వేదికగా ఉండే పోటీలను శైవ క్షేత్రమైన రామప్పలో నిర్వహి ంచడం దేనికి సంకేతమనే ప్రశ్నలను పలువురు లేవనెత్తుతు న్నారు. అయితే ప్రపంచస్థాయిలో జరిగే అందాల పోటీలకు ఆతిథ్యమిస్తే పరోక్షం గా ఈ ప్రాంతానికి పెట్టుబడులు పెరుగు తాయని, పర్యాటకంగా అభివృద్ధి చెంది వేలాది మందికి ప్రత్యక్షం గా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని పలువురు అభిప్రాయపడు తున్నారు. ఏదేమైనా చారిత్రక, భౌగోళిక ప్రత్యేకతలు కలిగిన ములుగు జిల్లా ప్రతిష్ఠాత్మకమైన మిస్‌వరల్డ్ పోటీలకు వేదికగా నిలుస్తుండడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



కాంగ్రెస్‌లో క్రషర్ ఫైట్!


- మంత్రి, ఎమ్మెల్యేల మధ్య మరోసారి చిచ్చుపెట్టిన వివాదం
- కంకర క్రషర్స్‌కు కాలుష్య నియంత్రణ విభాగం నోటీసులు
- నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నాయని కొన్ని సీజ్
- తమకు తెలియకుండా నోటీసులా.. అంటూ ఎమ్మెల్యేల ఆగ్రహం
- సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరిన ఓరుగల్లు క్రషర్స్ పంచాయితీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 385కు పైగా కంకర క్రషర్లు ఉన్నాయి. అయితే పలు ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ విభాగం అధికారులు కంకర క్రషర్లలో తనిఖీలు నిర్వహించారు. వీటిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని క్రషర్లను సీజ్ చేయగా, మరికొన్నింటికి నోటీసులు ఇచ్చారు. అలాగే మైనింగ్ శాఖ అధికారులు కూడా క్రషర్లను తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్న వాటికి భారీగా రూ.కోట్లలో జరిమానాలు విధించారు. దీంతో ఇప్పటికే డీజీపీఎస్ ఈటీఎస్, అధిక జరిమానాలతో తీవ్రంగా నష్టపోతున్న క్రమంలో కాలుష్య నియంత్రణ, మైనింగ్ శాఖ, విద్యుత్‌శాఖల అధికారులు మూకుమ్మడిగా దాడులు చేస్తుండటంతో క్రషర్ యాజమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచి క్రషర్ యాజమానులు సమ్మెబాట పట్టారు. ఏటా రాయల్టీ ఫీజు హెక్టార్‌కు రూ.1లక్ష వరకు చెల్లిస్తున్నామని, అలాగే 80శాతం కంకరను ప్రభుత్వ పనులకే విక్రయిస్తున్నామని వాపోతున్నారు. 25ఏళ్లుగా లీజు తీసుకున్న క్వారీలో ఇప్పుడు కొత్తగా డీజీపీఎస్ ఈటీఎస్ సర్వే పేరుతో భారీగా పెనాల్టీ విధిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసున్నారు. క్రషర్ యాజమానులు ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈ విషయంపై ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే కాలుష్య నియంత్రణ విభాగం అధికారులకు ఫోన్ చేసి, దాడులు నిలిపి వేయాలని, క్రషర్ యాజమానులు నష్టాల్లో ఉన్నారని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతోనే తాము దాడులు చేసి, నోటీసులు ఇస్తున్నామని తేల్చి చెప్పటంతో క్రషర్ ఇష్యూ కాంగ్రెస్‌లో మరో లొల్లికి దారితీసింది.

నోటీసులపై.. మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేలు

కంకర క్రషర్లకు నోటీసులు ఇవ్వటంపై ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురైదుగురు ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. తమకు తెలియకుండా, తమ నియోజకవర్గంలోని క్రషర్లపై దాడులు చేయటంతో పాటు నోటీసులు ఇవ్వడం ఏంటని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులకు వెనుక ఓ మంత్రి ఉన్నారని నిర్ధారణకు వచ్చిన నేతలు క్రషర్ యాజమానుల నుంచి వివరాలు సేకరించినట్టుగా తెలిసింది. తొలుత ఈ విషయమై ఓ మంత్రిని కలిసి దాడులు నిలిపి వేయాలని కోరగా, ఓ మాజీ ప్రజాప్రతినిధిని కలవాలని సూచించినట్టుగా ప్రచారం జరుగుతోంది. దీంతో సదరు మాజీ నేత క్రషర్ల సంఘం నేతలపై మండిపడటంతో పాటు భారీగా డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గం పరిధిలోని క్రషర్లపై ఆ మాజీ ప్రజాప్రతినిధి పెత్తనం ఏంటని మండిపడినట్లుగా తెలిసింది. అయితే క్రషర్లలో చాలా వరకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులవే ఉన్నాయని, గులాబీ క్రషర్లకు ఎమ్మెల్యేలు ఎలా సపోర్టు చేస్తారంటూ సదరు మాజీ నేత అనుచరులు ఫైర్ అవుతున్నారు. గత ప్రభుత్వం హయంలో ప్రభుత్వానికి రాయల్టీ కట్టకుండా కోట్లాది రుపాయల మైనింగ్ చేశారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో సదరు మంత్రి, మాజీ ప్రజాప్రతినిధి తీరుపై గత ఐదు రోజుల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. క్రషర్ యాజమానులను ఇబ్బందికి గురి చేయటంతో వారు సమ్మె చేస్తున్నారని, ఫలితంగా ప్రభుత్వ కాంట్రాక్టు పనులకు కంకర కొరత ఏర్పడుతుందని వారు తెలిపినట్లుగా సమాచారం. సదరు మాజీ ప్రజాప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్నింట్లో తలదూర్చుతున్నారని, కంట్రోల్ చేయకుంటే కష్టమని చెప్పినట్లుగా తెలిసింది. దాంతో 'నేను చూసుకుంటా.. మీరేమీ ఆందోళన చెందకుండి' అని సీఎం వారికి భరోసా ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇదే విషయమై సదరు మంత్రి కూడా సీఎంకు వివరణ ఇచ్చినట్టు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో క్రషర్ల అక్రమ దందాను అడ్డుకునేందుకు అధికారులు అడుగు పెట్టనివ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే నిబంధనల మేరకు క్రషర్స్ ఉన్నాయా లేదా అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలిస్తున్నారని ఆ మంత్రి చెప్పినట్టు సమాచారం. ఇక మైనింగ్‌శాఖ తన పరిధిలో లేదని, అది మీ(సీఎం) చేతుల్లోనే ఉందని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే మైనింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి ఉంటారని చెప్పినట్టుగా ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా నిబంధనల ప్రకారం క్రషర్లు నడుపుకుంటే తమకేమిటని వ్యాఖ్యానించారని తెలుస్తోంది. ఈ వివాదం ఎటూ తేలకపోవటంతో పదిరోజులుగా కంకర క్రషర్లు తెరుచుకోవటం లేదు. అయితే క్రషర్ యాజమానులు మాత్రం తాము నిబంధనల ప్రకారమే క్రషర్లు నడుపుతున్నామని, తమపై మైనింగ్‌శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దాడులను నిలిపివేసి సహకరించాలని వారు కోరుతున్నారు.




నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య ఏర్పడిన ఈ విభేదాలు కొత్తవేమీ కాదు కానీ, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంటే.. కీలక నేతల మధ్య గ్యాప్ పార్టీకి నష్టమని అధిష్ఠానం పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. దేవాలయ కమిటీల్లో మంత్రి సురేఖ తమకు సహకరించటం లేదని కొందరు ఎమ్మెల్యేలు అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, అప్పటి ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిలకు ఫిర్యాదు చేసిన సంఘటనలున్నాయి. గురువారం రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశాన్ని గీసుకొండ మండలం కొమ్మాలలో ఏర్పాటు చేశారు. అయితే మంత్రి అనుచరుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని, స్థానిక ఎమ్మెల్యే అడ్డుకున్నారని నిర్వాహకులు ఆందోళనకు దిగారు. నిత్యం ఎక్కడో ఓ చోట బయటపడుతున్న కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాలతో క్యాడర్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అందరూ సీనియర్ నేతలే కావటంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఎవరికి ఎలా చెప్పాలో తెలియక సతమతమవుతోందనే చర్చ జరుగుతోంది. నేతల మధ్య విభేదాల కారణంగా నామినేటెడ్ పదవులు కూడా రాకుండా పోతున్నాయని ద్వితీయశ్రేణి నేతలు వాపోతున్నారు. మొత్తానికి ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ క్రషర్ల లొల్లి నేతల మధ్య గ్యాప్ పెంచిందనే టాక్ పార్టీలో వినిపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి అడుగులు వేస్తుందో అనేది కేడర్‌లో ఆసక్తిగా మారింది.


రామలింగేశ్వరుని దర్శించగ రారండి

రామప్పలో మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు

- మూడు రోజుల పాటు జరుగనున్న వేడుకలు
- ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు



ఆలయంలోని రామలింగేశ్వరస్వామి



నందీశ్వరుడు

వెంకటాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామ శివారులో గల యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ కళాక్షేత్రం రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి రాజకీయ ప్రముఖులతోపాటు పరిసర ప్రాంతాల నుంచేకాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. సుమారు 50వేల నుంచి లక్షవరకు భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడంతోపాటు రెండురోజులపాటు ఇక్కడే బస చేస్తారని దేవాదాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేయించారు. తాగునీటి వసతితోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్‌లతోపాటు బారీకేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి విద్యుత్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులకు, ప్రైవేట్ వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. ఎండోమెంట్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పోలీస్‌శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ రామప్ప దేవాలయాన్ని సందర్శించి బందోబస్తుపై పలు సూచనలు కూడా చేశారు.

ఉత్సవాలు ఇలా...

26న బుధవారం మహాశివరాత్రి ఉదయం 4.30గంటలకు సుప్రభాతం, 6గంటలకు గణపతిపూజ,అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం, వృత్విక్కరణం, సామూహిక రుద్రాభిషేకం, రాత్రి 10గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, జాగరణ జరుగనుంది. 27న గురువారం ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణపతిపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, ఉదయం 11గంటలనుంచి గణపతిపూజ, గ్రహారాధన, వీరభద్రపల్లేరము, సాయంత్రం భద్రకాళి పూజ, సహస్రనామార్చన, బలిహరణ, రాత్రి దీపోత్సవం, ఇదేరోజు తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండంలో నడుచుట జరుగుతుంది. 28న శుక్రవారం ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణపతిపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, ఉదయం 8గంటలకు నాగబలి గెలుపు, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం జరుగుతుంది.




కాళేశ్వరాలయం

త్రిలింగ క్షేత్రం.. శివరాత్రికి సిద్ధం

- కాళేశ్వరాలయంలో జాతరకు ఏర్పాట్లు పూర్తి
- అధికసంఖ్యలో తరలి రానున్న భక్తులు

మహదేవపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మూడు నదుల కలయిక.. మూడు రాష్ట్రాలకు వారధి.. ఒకే పానవట్టంపై రెండు లింగాలున్న ఏకైక పుణ్యక్షేత్రం కాళేశ్వర దేవాలయం. త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వర క్షేత్రంలో మూడు నదుల ప్రవాహం, మూడు రాష్ట్రాల సరిహద్దులో వెలిసిన కాళేశ్వర ముక్తీశ్వర మహాశివరాత్రి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ ఆలయంలో 25, 26, 27తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో మహేష్ శనివారం తెలిపారు. శివ రాత్రి రోజు లక్ష నుంచి రెండు లక్షల వరకు భక్తులు వస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో తాగునీరు, ఇతర ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించామన్నారు. గోదావరిలో భక్తులకు దుస్తులు మార్చుకోవడంతో పాటు అధికంగా ఎండలు ఉండడంతో గోదావరిలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్, పోలీసు , అన్ని శాఖల అధికారులు మూడు రోజుల పాటు అంగరగంగ వైభవంగా జరిగే జాతర పనుల్లో అందరూ పాల్గొనాలని తెలిపారు. సేవాతాత్పరత ఉన్న భక్తులు సైతం ఆలయానికి వచ్చే భక్తులకు సేవలందించవచ్చని తెలిపారు.



కాళేశ్వరాలయంలోని లింగాలు

మూడురోజుల కార్యక్రమాలిలా..

25న ఉదయం 10 గంటలకు మంగళవాయిద్యాలతో దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షా వస్త్రధారణ, రుత్విగ్వరణం, ఉదయం 11 గంటలకు దేవతారాధాన, నవగ్రహారాధాన, తదితర ఉత్సవాలు జరుగుతాయి. 26న సాయంత్ర 4.35 గంటలకు శ్రవణ నక్షత్రయుక్త కర్కాటక లగ్నమందు శ్రీ ముక్తీశ్వర శుభానందదేవిల కల్యాణ మహోత్సవం జరుగును.

రాత్రి 8 గంటల నుంచి హరికథా కాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగును. రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజ, అనంతరం చండీ హోమం, కాళరాత్రి హోమం జరుపును. 27న ఉదయం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సదస్యము, మహదాశీర్వచనం, పండిత సన్మానం, సాయంత్రం 4 గంటలకు ఆది ముక్తీశ్వర స్వామి వారి కల్యాణం జరుగును. రాత్రి 8 గంటలకు నాక బలి, పవళింపు సేవ జరుగనని ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ తెలిపారు.

కేయూ జంతుశాస్త్ర విభాగం పరిశోధకుల అరుదైన ఘనత

రెండు పేటెంట్లు సాధించిన వెంకన్న, కవిత

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం పరిశోధకులు డాక్టర్ లూనావత్ వెంకన్న, బూర్గుల కవితలు అరుదైన ఘనత సాధించారు. వీరిద్దరూ కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు వేర్వేరుగా భారత ప్రభుత్వం పేటెంట్‌లు ప్రకటించింది. ఈ మేరకు శనివారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంల చేతుల మీదుగా పేటెంట్లు పొందిన వెంకన్న, కవితలు ధ్రువ పత్రాలను పొందారు. ఈ సందర్భంగా వారు తమ పరిశోధన, పేంటెంట్ల వివరాలను తెలిపారు. డాక్టర్ లూనవత్ వెంకన్న పీహెచ్‌డీ, పీడీఎఫ్ పరిశోధనలు చేశారు. ఔషధ మొక్కల నుంచి తయారు చేసిన రసాయనాల బయోలజికల్ యాక్టివిటీపై వెంకన్న పరిశోధన చేశారు.

దీనికి గాను 2023 ఏప్రిల్‌లో భారత ప్రభుత్వ పేటెంట్ల కార్యాలయానికి దరఖాస్తులు చేయగా పేటెంట్ ప్రకటించింది. అలాగే బూర్గుల కవిత కెలోట్రోపిస్ ప్రొసీరా (శ్వేతార్క) ముక్కల వేళ్ల నుంచి రసాయనాన్ని మాడీఫై చేసి దాని బయోలాజికల్ యాక్టివిటీని పెంచే అంశంపై పరిశోధన చేశారు. 2024లో దీనికి గాను భారత ప్రభుత్వానికి పేటెంట్ కోసం దరఖాస్తు చేయగా, తాజాగా శనివారం పేటెంట్ హక్కులను ప్రకటించారు. వీరిద్దరూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ పర్యవేక్షణలో పీహెచ్‌డీ, పోస్టు డాక్టరల్ ఫెల్లో (పీడీఎఫ్) డిగ్రీలు సాధించారు. ఈ కార్యక్రమంలో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంతో.. పేటెంట్ పత్రాలు పొందిన వెంకన్న, కవిత, ఇస్తారి తదితరులు

పసుపు ఉడికించడంలో వినూత్న విధానం

- గోనె సంచుల్లో ఉడికిస్తున్నరైతు
- కాలం, ఖర్చు, శ్రమ తక్కువ.. వంట చెరకు ఆదా..

కేసముద్రం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో భూమిలోంచి వెలికి తీసిన పసుపును పెనాల్లో ఉడికించడం సాధారణమైన విషయమే! ఇందుకు భిన్నంగా వినూత్న విధానాన్ని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వలకు చెందిన గో ఆధారిత సాగు రైతు గంట దామోదరరెడ్డి అనుసరిస్తున్నారు. సంప్రదాయ విధానంలో పసుపును పెనంలో వేసి నీళ్ల పోసి, పైన తట్టుబస్తాలను కప్పి 20 నుంచి 30 నిమిషాల పాటు ఉడికిస్తారు. నీళ్ల పొంగు వచ్చిన అనంతరం పొయ్యిపై నుంచి పెనాన్ని బయటకు తీసి పసుపును వార్చి ఆరబెట్టుకుంటారు. ఇందుకు పూర్తిభిన్నంగా తక్కువ కాలం, ఖర్చు, శ్రమతో కూడిన సులువైన వినూత్న విధానాన్ని దామోదరరెడ్డి అవలంబిస్తున్నారు. పసుపును గోనెసంచుల్లో వేసి ఆ సంచిని పెనంలో మరుగుతున్న నీటిలో ముంచి ఉడికిస్తున్నారు. ఈ విధానంలో కేవలం ఐదారు నిమిషాలు ఉడికిస్తే చాలని రైతు దామోదర్‌రెడ్డి తెలిపారు. అంతేకాకుండా ఇద్దరు మనుషులతోనే తక్కువ వంటచెరుకు వినియోగించి ఉడికించడాన్ని పూర్తి చేయవచ్చని తెలిపారు. ఇలా ఉడికించిన పసుపులో అత్యంత కీలకమైన కర్‌క్యూమెన్ శాతం తగ్గిపోకుండా నాణ్యతగా ఉంటుందని ఆయన తెలిపా రు. దీనివల్ల పసుపునకు అధిక ధర వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు.



కల్వలలో పసుపును గోనె సంచుల్లో ఉడికిస్తున్న రైతు దామోదర్‌రెడ్డి



మేఘాలయ రకం పసుపు దుంపలను చూపుతున్న రైతు



సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

గూడూరు ఏజెన్సీ షెడ్యూల్డ్ గ్రామమే

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీ షెడ్యూల్డ్ గ్రామమేనని తుడుందెబ్బరాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈసం సుధాకర్, పడిగె నాగేశ్వర్‌రావు అన్నారు. గూడూరులోని కొమురంభీం కమ్యూనిటీ హాల్లో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు లింగాల కిరణ్ అధ్యక్షతన శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం 1950లో అమల్లోకి వచ్చినప్పటి నుంచి భారత రాజ్యాంగ గెజిట్‌లో గుర్తించబడిన షెడ్యూల్డ్ గ్రామాల లిస్టులో గూడూరు గ్రామం, మండలం కూడా ఉందని పేర్కొన్నారు. ముమ్మాటికి గూడూరు షెడ్యూల్డ్ ప్రాంతమేనని పేర్కొన్నారు. పూర్వకాలం నుంచి బ్రహ్మణపల్లి, మత్రిమిట్ట, దామరవంచ, మచ్చర్ల, మట్టెవాడ గ్రామాల్లోని ఆదివాసీ ప్రజలు గూడూరులో నివసిస్తున్నారని, ఇందుకు సాక్షాధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. మూడుదఫాలుగా సర్పంచ్‌గా షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారే కొనసాగారన్నారు. కొంతమందిగిరిజనేతరులు షెడ్యూల్డ్ గ్రామం కాదనడంలో అర్థం లేదన్నారు. వారి స్వప్రయోజనాల కోసం గిరిజనేతరులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారికి త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మంగయ్య,ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు దారం సాంబయ్య, వజ్జయ్య, ఈసం మల్లికార్జున్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ వహించొద్దు

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ వహించవద్దని, రోడ్లపై చెత్తాచెదారం లేకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్, మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో శనివారం ఉదయం పర్యటించి పారిశుధ్యా నిర్వహణనుపరిశీలించి కార్మికులతో మాట్లాడారు. ప్రతీరోజు మునిసిపాలిటీ పరిధిలో ఎంత చెత్త సేకరణ జరుగుతోంది.. ఎన్ని ట్రాక్టర్లు.. ఆటోల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్ యార్డును సందర్శించి పట్టణంలో సేకరించిన చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలో ప్రతీదినం చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా మునిసిపల్ వాహనాలు వచ్చిన సమయంలో అందులోవేసి మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, తోట రాజేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పో

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి..

గూడూరు,(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. గూడూరులోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాల, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వంటగదులు, స్టోర్ రూం, డైనింగ్‌హాల్, పరిసరాలను పరిశీలించి వార్డెన్‌లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులు పాఠాలను శ్రద్ధగా వినాలి : డీఈవో

డోర్నకల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని, అందుకనుగుణంగా లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదవాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. శనివారం చిల్కోడు మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో మోడల్‌స్కూల్ నుంచి కనీసం 30 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ చావ కృష్ణభాను, చిల్కోడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వీరభద్రం, విత్తనాల సుధాకర్, చంద్రశేఖర్ ఆజాద్, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా బోధనలో అలసత్వం చేయిద్దు..

గార్ల, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విద్యాబోధన విషయంలో అలసత్వం చేసి, ఉత్తీర్ణత శాతం తగ్గితే ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో రవీందర్ హెచ్చరించారు. శనివారం గార్లలోని పీఎస్ పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఎంఈవో మంకిగి వీరభద్రం, సీనియర్ ఉపాధ్యాయులు మాలోత్ శివనాయక్, పాల్గొన్నారు.



చిల్కోడు మోడల్‌స్కూల్ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి



సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న మధుసూదన్

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

● ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

కొత్తగూడ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ వరంగల్ డైరెక్టర్ మధుసూదన్ సూచించారు. కొత్తగూడలోని సబ్‌స్టేషన్‌ను ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ వరంగల్ డైరెక్టర్ మధుసూదన్ శనివారం పరిశీలించారు. పోలారంలో ఏర్పాటు చేస్తున్న 600కేవీఏఆర్ లైన్ కెపాసిటర్ పనులను పరిశీలించారు. 600కేవీఏఆర్ లైన్ కెపాసిటర్‌లను ప్రారంభించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్‌లను బిగించుకోవాలని సూచించారు. ఎస్ఈ నరేష్, ఆపరేషన్ మహబూబాబాద్ డీఈ విజయ్, టెక్నికల్ డీఈ పెద్దిరాజం, ఏడీఈ కవిత, ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జంగిలిగొండలో వ్యక్తి అదృశ్యం



జగన్నాథచారి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : జంగిలిగొండ గ్రామానికి చెందిన పోతుగంటి జగన్నాథచారి అదృశ్యమైనట్లు టౌన్ సీఐ దేవేందర్ శనివారం తెలిపారు. జగన్నాథచారి ఈనెల 18న ఉదయం 7 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి, ఆటో ఎక్కి మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లోని కోర్టు వద్ద దిగాడని ఆటోడ్రైవర్ చెప్పారు. అదేరోజు సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వారివారి బంధువుల ఇండ్లలో వాకబు చేసినట్లు చెప్పారు. ఎక్కడ అచూకీ లభించకపోవడంతో జగన్నాథచారికుమారుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

25 లీటర్ల గుడుంబా స్వాధీనం

నెల్లికుదురు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వావిలాల క్రాస్‌రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను శనివారం పోలీసలు పట్టుకున్నారు. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. సంధ్యతండాకు చెందిన బానోత్ సంతోష్, ధర్మతండాకు చెందిన బానోత్ నరేష్ బైక్‌పై రూ.10 వేల విలువ చేసే 25 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా, దానిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు.

బూరుగుపాడులో పశువుల అపహరణ

డోర్నకల్,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బూరుగుపాడలోని షేక్ సైదులుకు చెందిన పశువులు గురువారం రాత్రి అతని వ్యవసాయక్షేత్రం వద్ద నుంచి అపహరణకు గురయ్యాయి. సైదులు తనకున్న ఆవు, గేదే, లేగదూడను రోజు వ్యవసాయక్షేత్రం వద్దనే కట్టివేసి ఇంటికి వచ్చేవాడు. గురువారం కూడా వాటిని అక్కడే కట్టేసి ఇంటికి వచ్చాడు. మర్నాడు లేచి వ్యవసాయక్షేత్రం వద్ద వెళ్లగా అక్కడ తన పశువులు కన్పించలేదు. దీంతో సైదులు కుమారుడు షేక్‌జమాల్ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు.

లింగాల ఘనపురంలో లభ్యం

కాగా, జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నవాబ్‌పేట సంతలో మండలంలోని గొల్లచర్లకు చెందిన వ్యక్తి సైదులు పశువులను గుర్తించి, సమాచారం అందించాడు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న సైదులు తన పశువులను పట్టుకున్నాడు. పశువులు అపహరించిన వ్యక్తులను గుర్తించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్యపై కేసు నమోదు

బయ్యారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మనస్థాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రంలోని రుద్రమాదేవి వీధికి చెందిన బత్తుల అప్పయ్య ఆటో నడుపుకుంటూ జీవినం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 21 శుక్రవారం మధ్యాహ్నం డబ్బుల విషయమై తన భార్య పుష్పతో అప్పయ్యకు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆటో తోలడానికి సంబంధించిన డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదనేదానిపై భార్యాభర్తల నడుమ ఘర్షన జరిగినట్లు తెలిసింది. దీంతో మనస్థాపం చెంది శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన పుష్ప (40) సమీప బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన భార్య పుష్ప ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన భర్త అప్పయ్య సమీప ప్రాంతాలను వెతికినప్పటికి ఫలితం లేదు. ఈ క్రమలోనే అప్పయ్య ఇంటి సమీపంలోని బచ్చలి నర్సమ్మ ఇంట్లోని బావిలో పుష్ప శవమై కనిపించింది. మృతురాలికి ఇరువురు పిల్లలున్నారు. మృతురాలి అన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

పద్మశాలి సంఘం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంచందర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మార్చి 9న జరిగే అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభ పోస్టర్లను మానుకోట మార్కండేయ దేవాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచందర్, జిల్లా అధ్యక్షుడు చిలకమారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలి కులస్థులంతా ఐక్యమత్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో జరిగే మహాసభకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనుమాండ్ల వెంకటేశ్వర్లు, కైరంకొండ వీరన్న, బొమ్మ వెంకటేశ్వర్లు, కల్వకుంట్ల శ్రీనివాస్, కొమ్మాకుల రాజేశ్వర్‌రావు, బాల్నె సుమన్, చెన్నూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శివారు విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఏఈ వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిగపురం సబ్‌స్టేషన్‌లో 33కెవిలైన్‌కు మరమ్మతుల కారణంగా వీరారంతండా, మల్యాల, అయోధ్య, శనిగపురం ఫీడర్‌లో ఉన్న గ్రామాలు, తండాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

25న బేస్‌బాల్ సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా బేస్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలుంటాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల సంజీవరావు, కల్లూరి ప్రభాకర్‌రావు శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 1నుంచి 2012, డిసెంబరు 31 మధ్య జన్మించినవారై ఉండాలన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని నలంద జూనియర కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ గట్ల శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ మార్చి మొదటివారం నుంచే వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ప్రతీ ప్రశ్నకు క్షుణ్ణంగా చదివి జవాబులు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకుట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ డోలి సాధన, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, మాజీ వార్డు కౌన్సిలర్ డోలి లింగుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన కారు

మరిపెడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓ కారు ప్రమాదానికి గురి కాగా దాంట్లో ప్రయాణిస్తున్న నలుగురికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. శనివారం వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లతున్న కారు స్థానిక సోషల్ వెల్ఫేర్ స్కూల్ దగ్గర గుంతను తప్పించపోయి చెట్టుకు ఢీకొంది. దాంట్లో ప్రయాణిస్తున్న వరంగల్ పట్టణానికి చెందిన అమీర్, అహ్మద్, సిరాజ్, మోసిన్‌లు స్వల్ప గాయాలకు గురయ్యారు.

స్నేహితుడి కుమారుడి ఫీజు చెల్లింపు

కేసముద్రం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి స్నేహితులు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుమారుని స్కూల్‌ఫీజును బాల్యమిత్రులు చెల్లించారు. ధన్నసరికి చెందిన గోపాల వెంకట్‌రెడ్డి ఇటీవలె గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. ఆయన కుమారుడు త్రివిక్‌రెడ్డి కేసముద్రం శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో ఐదో తరగతి చదువుతుండగా శనివారం రూ.10వేల ఫీజును వెంకట్‌రెడ్డి బ్యాచ్‌కు చెందిన కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ 1994-95 క్లాస్‌మెట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెల్లించారు. మానవతాదృక్పథంతో మరో రూ.6వేల ఫీజు బకాయిని కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ మినహాయించారు. కొద్దినెలల క్రితం వెంకట్‌రెడ్డి వైద్యానికి ఇదే బ్యాచ్ ఆధ్వర్యంలో రూ.41వేలు అందజేశారు. అసోసియేషన్ కోశాధికారి మిడతనపల్లి ప్రకాశ్, చిట్యాల వీరన్న, దేశబోయిన సుధాకర్, కొండబోయిన శ్రీను, యాసారపు సతీష్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవిత పర్యటనను సక్సెస్ చేయాలి'

మరిపెడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కవిత మరిపెడ పర్యటనను విజయవంతం చేయాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం రెడ్యానాయక్ మరిపెడలోని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గెస్ట్‌హౌస్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కల్వకుంట్ల కవిత ఈనెల 24న మరిపెడ కార్యకర్తల సమావేశంలో పాల్గొని చిల్లంచర్లలోని మారిపెల్లి మాదవి గృహప్రవేశ వేడుకలకు హాజరుకానున్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ వెంకన్న, రాంబాబు, రవీందర్, శాస్త్రీ, రఘు, లక్ష్మారెడ్డి, గండి మహేశ్, పుల్లయ్య, హరి, సుదర్శన్‌రెడ్డి, కృష్ణ, రెడ్డి, పానుగోత్ వెంకన్న, బాలాజీ, ముకేశ్, దిగిజర్ల శ్రీను, భరత్ పాల్గొన్నారు.

● దంతాలపల్లి, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 24న మండలంలోని రామానుజపురానికి రానున్నట్లు మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. రామానుజపురంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన దివ్యాంగుడు చిర్ర సాయిసతీష్ ఇటీవల ఉపాధి కల్పించాలంటూ వేడుకోవడంతో స్పందించిన ఎమ్మెల్సీ కవిత ఆయనకు ల్యాప్‌టాప్‌తో పాటు, జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను అందించనున్నారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని స్వాగతం పలకాలన్నారు. తాజామాజీ జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ధర్మారపు వేణు, మాజీ ఎంపీటీసీ కిషోర్ పాల్గొన్నారు.

● డోర్నకల్, (ఆంధ్రజ్యోతి) : సోమవారం కురవిలో పర్యటించనున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటనను జయప్రదం చేయాలని డోర్నకల్ మాజీఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం గొల్లచర్లలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, సంజాల మధుసూదన్, పోటు జనార్దన్, కత్తెరసాల విద్యాసాగర్, బాలునాయక్, కాడెం బాబు, పాండునాయక్, వెంకట్రామ్, రమేష్, కాసం వెంకన్న, అజిత్ మియా, లాలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న రెడ్యానాయక్

ఆరుగురు వైద్యసిబ్బందికి మెమోలు

● డాక్టర్‌తో పాటు ఐదుగురుకి సంజాయిషీ నోటీసులు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఆరుగురు సిబ్బందికి జిల్లా వైద్యాధికారి మురళీధర్ సంజాయిషీ నోటీసులను శనివారం పంపారు. జిల్లా వైద్యాధికారి శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ నిర్వహించగా వైద్యాధికారి డాక్టర్ డి.సురేష్, హెచ్ఈవో డి.భిక్షపతి, ఫార్మాసిస్ట్ పి.శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ జి.రమాదేవి, ఎంపీహెచ్ఎస్ పి.కృష్ణకుమారి, ఎంపీహెచ్ఏ జె.శ్రీనివాస్ సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో గుర్తించారు. ఈ మేరకు ఆరుగురికి రెండు రోజుల్లో గైర్హాజరుకు కారణాలను తెలపాలని సంజాయిషీ నోటీసులను పంపారు.

6 నెలల పాటు గార్ల-డోర్నకల్ మధ్య రైల్వేగేటు మూసివేత



గార్ల-డోర్నకల్ మధ్య రైల్వేగేటును మూసివేసిన రైల్వే అధికారులు

గార్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గార్ల మండలం డోర్నకల్ సమీపంలోని రైల్వే వంతెనతోపాటు గేటు, సీతారామ ప్రాజెక్టు కాలువ పనుల నిర్మాణ మరమ్మతుల కారణంగా గార్ల-డోర్నకల్ మధ్యఉన్న గేట్ ఎల్‌సీ నెంబర్ 90 గేట్‌ను నేటి నుంచి ఆరు నెలల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. గార్ల నుంచి డోర్నకల్, ఖమ్మం వెళ్ల ప్రయాణికులను తిర్లాపురం సమీపంలోని అండర్ బ్రిడ్జి నుంచి బుద్ధారం మీదుగా వాహనాలను మళ్లించారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురికావడం జరుగుతుంది వాహనదారులు వాపోతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి

బయ్యారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి స్థానిక తహసీల్దార్ విజయను ఆదేశించారు. శనివారం బయ్యారం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. బయ్యారం మండలంలోని మొత్తం 85 మంది ఓటర్లుకు గాను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు 59వ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మరిపెడ రూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని ఎల్లంపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం గుగులోతు వెంకన్న మాట్లాడారు. ఉపాధ్యాయుడు కొవ్వొత్తి లాంటివాడన్నారు. కొవ్వొత్తి తాను కరిగిపోతూ వెలుగును ఇస్తోందన్నారు. ప్రతీ టీచర్ తాను చెప్పబోయే పాఠ్యాంశాన్ని ప్రిపేర్ కావాలన్నారు. విజయ్‌కిరణ్, ఎం.లలిత, ఎం.శోభ, పి.ప్రసాద్, డి.లలిత, ఒకరోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి : బీజేపీ

తొర్రూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో సరోత్తమ్ రెడ్డి గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. నాయకులు పూసల శ్రీమాన్, రాజేష్, కొలుపుల శంకర్, కుమార్, నవీన్, యాకయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి

తొర్రూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగు, సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం ఆయా శాఖల అధికారులతో అమెరికా నుంచి ఫోన్‌ద్వారా మాట్లాడి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా నీటి కొరత కారణంగా పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని, తాగునీటికి గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దన్నారు. రైతుల కష్టాలు తగ్గించేందుకు, వారి పంటలు సంరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎంపీపీ సీతారాంపూర్ స్కూల్ తనిఖీ

మరిపెడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఎంపీపీ సీతారాంపూర్ స్కూల్‌ను శనివారం ఎంఈవో అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన వంటలను చెక్ చేశారు. ఆపార్ ఐడీలు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆధార్ వ్యాలిడేషన్ పూర్తి చేయాలన్నారు. హెచ్‌ఎం అర్జున్, టీచర్లు మంగీలాల్, లింగాల మహేష్‌గౌడ్, సందీప్, వెంకటేశ్వరావు, కవిత, సారిక, సీఆర్పీ రమేష్ ఉన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి మృతి

నెల్లికుదురు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నైనాలలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పెరమాండ్ల నరేష్ (38) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక శనివారం సాయంత్రం తన వ్యవసాయ భూమి వద్దవెళ్లి పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పెరమాండ్ల శిరీష, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉన్నత పాఠశాలల్లో స్వయం పాలన

కేసముద్రం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల, కేసముద్రం విలేజి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం హెచ్‌ఎంలు బండారు నరేందర్, చీకటి వెంకట్రాంనర్సయ్య ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కల్వలలో హెచ్‌ఎంగా కడారి తేజస్విని, డీఈవోగా మూడు నర్సింహ, ఎంఈవోగా వంశీ, విలేజిలో హెచ్‌ఎంగా బి.శివకుమార్, ఎంఈవోగా యశ్వంత్, డీఈవోగా హాసిని, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. న్యాయనిర్ణేతలుగా పీఎస్ హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి, దుర్గాప్రసాద్, తండ హరీష్‌లు వ్యవహరించగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరుకులు సకాలంలో సరఫరా చేయాలి

నర్సింహులపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి ప్రతీ నెల సరఫరా అయ్యే ప్రజా పంపిణీ సరుకులు లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని అని గ్రామాల రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా సరుకుల స్టాక్ నిల్వలను రేషన్ డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు డీలర్లు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రభాకర్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గడ్డి వెంకట్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

బీజేపీని ఎదుర్కొనే శక్తి ఎవరికీ లేదు

● పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని ఎదుర్కొనే శక్తిఎవరికి లేదని పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరు మండలం తీగలవేణి, అప్పరాజుపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, మండల అధ్యక్షుడు రాచమల్ల వెంకటేశ్వర్లు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, కోరె అనిల్, సోము, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.